# తరగని గని

చిరంజీవి వేంకట సూర్య ప్రకాశాన్ని నీ తండ్రి అ॥ సుందర రామయ్య చిరాయువుగా దీవించి వ్రాయునదేమనగా, ఇచ్చట నేనూ, మీ అమ్మా క్షేమం గానే వున్నాము. అచ్చట నీవూ, కోడలు చిరంజీవి సౌభాగ్యవతి వేంకటలక్ష్మి, పిల్లలున్నూ క్షేమంగా వున్నారని భావిస్తున్నాను.

ఈ సంవత్సరము మన వూళ్లో దరసా పండుగ వుత్సవాలు ప్రతియేడు కంటేనూ బాగా జరిగాయి. మన వీధిలోనే వెలిసి వున్న శ్రీ కోట మహిషమ్మ వారి గుడిలో పూజలు ఘనంగా జరిగాయి. మీరెవరయినా వస్తారేమోనని నేనూ, మీ అమ్మానూ ఎంతగానో ఎదురు చూశాము. కాకినాడ నుంచి చి॥ శేఖరం వాళ్ళు కూడా ఎవరూ రాలేదు. గుంటూర్నుంచి అమ్మాయి చిరంజీవి సౌభాగ్యవతి మంగతాయారు వాళ్ల కూడాన్నూ రాలేదు. అల్లుడుకు శలవు దొరకలేదంట.

ప్రత్యేకంగా మన వూళ్లో గొప్పగా జరిగే ఈ పండుగకు పిల్లలెవరూ యింటి వద్ద లేకుండా పోయారని మీ అమ్మ చాలా ఇదయిపోయింది.

త॥ ముఖ్యంగా వ్రాయునదేమనగా, పండుగరోజున మీఅమ్మ శ్రీ కోట మహిషమ్మ అమ్మవారి గుడికి పూజలు చూస్తానికి వెళ్ళింది. గుడి కెళ్ళుతూ తన పెద్ద గొలుసు - ఆరుపేటల చంద్రహారం - మెళ్ళో వేసుకెళ్ళింది. జనం తొడతొక్కిడిగా వున్నారు. ఆ తోపుడులో ఈ గొలుసు వేసుకుని వెళ్ళకపోతేనేం లేవే, వద్దే అని నేను అంటున్నప్పటికిన్నీ నా మాట వినకుండా గొలుసు మెళ్ళో వేసుకుపోయింది. మన పక్కింటి భాగ్యమ్మ కూడా వెంట వెళ్లింది. నేను భయపడినంతా అయింది. ఆ జనంలో వెనుకనుంచి ఎవరో గొలుసు పట్టుకుని గుంజారంట. మీ అమ్మ జాగ్రత్తగా వుండబట్టి సరిపోయింది. అలా గుంజగానే వెంటనే కేకేసిందట. అలా కేకెయ్యటం నయమయింది. ఆ కేకలు విని అంతా కలిసి ఆ దొంగ వెధవను పట్టుకుని చావచితక తన్నారంట. మన సొమ్ము గట్టిది కాబట్టి ఆ యొక్క కోటమహిషమ్మ తల్లి చల్లగా చూడబట్టి ఆ దొంగ వెధవ వుడాయించకుండా దొరికిపోయాడు. మన సొమ్మున్నూ చేతికి దక్కింది.

పాపం దీన్తో మీ అమ్మ చాలా బేజారెత్తిపోయింది. యింటికి వచ్చి ఏడుస్తూ కూర్చుంది. ఇంకా నగల మీద మోజు తీరక ఇటు కోడళ్ళకు గానీ, అటు కన్న కూతురుకు గానీ ఎవ్వరికీ యివ్వకుండా ఈ వయస్సులో పెట్టుకుని కులుకుతున్నందుకు బాగానే జరిగిందని వాపోయింది. ఇంకా నాదగ్గరే వుంటే ఇలాగే ఏ దొంగ వెధవో గొంతు పిసికి దీన్ని కాస్త గుంజుకుపోతాడు. నాకీ వయస్సులో యింకా

నగలెందుకు, ఎత్తుభారమెందుకూ, పిల్లల ముగ్గురికీ తలా రెండు పేటలిచ్చేస్తాను. వాళ్ళేమన్నా చేసుకోనియ్ అని ఒక నిర్ణయానికి వచ్చింది. కాబట్టి ఈసారి మీరంతా యిక్కడికి వచ్చినప్పుడు మీ అమ్మ చంద్రహారంలోని ఆరుపేటలున్నూ తలా రెండు పేటలివ్వటం జరుగుతుందని తెలపటమయింది.

కిందంతా సిమెంటంతా పోయిందని యింట్లో అద్దెకున్నవాళ్ళు గొడవ చేస్తుంటే రెండు రోజుల క్రితమే స్నానాల గదిలో కింద సిమెంటు చేయించాను. అద్దెకున్న వాళ్ళు వీళ్లు కాస్తాపోతే మళ్ళీ యింకొకళ్లు వచ్చేవరకూ ఇబ్బంది పడాలి. నెలకింతని ఆ అద్దె డబ్బులొస్తున్నాయి కాబట్టి, నీకుగానీ, చిరంజీవి శేఖరంకు గానీ మా విషయంగా ఎలాంటి యిబ్బంది కలిగించకుండా ఏదో మేమిద్దరం ఇలా కాలక్షేపం చేస్తున్నాము.

మన దొడ్లో వున్న కొబ్బరిచెట్లు రెండున్నూ ఈయేడు బాగానే కాశాయి. మీ అమ్మ దొడ్లో కూరపాదులు పెట్టింది.

పోతే, నీవు పంపించిన తైలం నా మోకాళ్ళ నొప్పులకు బాగా పనిచేసింది. ఈసారి ఎవరైనా వస్తుంటే మరో సీసా పంపించవలెను.

ఈరోజే కాకినాడకు చిరంజీవి శేఖరంకున్నూ, గుంటూరుకు చిరంజీవి సౌభాగ్యవతి మంగతాయారుకు కూడాన్నూ జాబులు వ్రాస్తున్నాను. కోడలు చిరంజీవి సౌభాగ్యవతి వేంకట లక్ష్మినిన్నీ, పిల్లల్నున్నూ అడిగినట్లు మీ అమ్మ మరీ మరీ వ్రాయమన్నది.

ఈ వుత్తరం అందిన వెంటనే అన్ని విషయములతో జాబు వ్రాయవలెను.

ఇంతే సంగతులు -

ఇట్లు

అ॥ సుందర రామయ్య వ్రాలు.

-దాదాపు ఈ విషయాలే మూడు వేర్వేరు వుత్తరాలుగా మూడు వూళ్ళకూ - బందరు, కాకినాడా, గుంటూరు - వెళ్ళాయి.

బందర్లో వుంటున్న, సుందరరామయ్య పెద్ద కొడుకు సూర్యప్రకాశం వుత్తరం వచ్చేసరికి ఆఫీసులో వున్నాడు. అతని భార్య వేంకటలక్ష్మి అంతకు ముందే భోంచేసి తాంబూలం వేసుకొని మాటిమాటికి నాలుక బయటపెట్టుకుని చూచుకుంటూ ప్రక్కింటి పంకజం చెప్పుతున్న సినిమా కథ వింటూ కూర్చుంది. గేటు తీసికొని లోపలికి వస్తోన్న పోస్టుమాన్‌ను చూడగానే ఆమె మొగం చాటంతయింది. తన చెల్లెలికి పెళ్ళి సంబంధం కుదిరినట్లు పుట్టింటి దగ్గర్నుంచి వుత్తరం వచ్చిందేమో ననుకుంది. ఆత్రంగా అందుకుని చించబోయింది. మళ్ళీ పైన దస్తూరీ చూచి, అది నూజివీడు నుండి మామగారి దగ్గర్నుంచి వచ్చిందని గ్రహించినదై చిరాగ్గా మొగం చిట్లించింది. విసుగ్గా ఆ కవర్ను ఆ కూర్చున్న చాప క్రిందకు నెట్టి, "అవును, అప్పుడేమయింది?" అని సినిమా కథను గురించి అడిగింది.

"అదేంటి, ఉత్తరం చించి చదవకుండానే చాప క్రిందకు నెట్టేశారు?" అని ప్రక్కింటి పంకజం అడిగింది.

"మా మామగారు రాశార్లే!" అంది ఎంతో నిర్లక్ష్యంగా. "ఆఁ, ఏం రాస్తారూ? మళ్ళీ ఏ తైలం సీసాలు పంపమనో రాసుంటాడు. అది సర్లే, ముందు కథ చెప్పు" అంది.

లొట్టలేసుకుంటూ సిన్మా కథ విని, ఆ చాపమీదే చిన్న కునుకు తీసి చల్లపడ్డాక లేచి చాప చుట్టుతుండగా మళ్ళీ కవరు కనిపించింది. మళ్ళీ మొగం చిట్లించి చాలా నిర్లక్ష్యంగా దాన్ని అలమర్లోకి చిన్నగా గిరవాటేసింది. ఆవులిస్తూ కాఫీ పెట్టడానికి వంటింట్లోకి పోయింది. ఆమెకు మామగారి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాలు చదవడమంటే మహా చెడ్డ చిరాకు.

కాసేపటికి వేంకట లక్ష్మి పెద్ద కూతురు వనజ రెండు జడలూయించుకుంటూ హైహీల్సు చెప్పులు తెగ మోగించుకుంటూ కాలేజీ నుంచి వచ్చింది. అలమర్లో పెన్ను పెట్టుతూ చింపకుండా పడివున్న ఆ కవర్ను చూచి అర్థము వ్రాసిన దస్తూరిని బట్టి అదెక్కడ్నుంచి వచ్చిందో ఇట్టే గ్రహించింది. "ఓ మైగాడ్, ఈ వోల్డ్‌మాన్ రాసిన లెటర్ చదివితే అనాసిన్ వేసుకోవల్సిందే" అని అనుకుంటూ భుజాలెగరేసుకుంటూ బాత్‌రూంకేసి వెళ్ళిపోయింది.

మరో అరగంటకు వేంకట లక్ష్మి చిన్న కూతురు జలజ స్కూల్నుంచి వచ్చింది. అలమర్లోని వుత్తరాన్ని చూచి అటూ ఇటూ తిప్పి ముక్కు మూసుకుంటూ, "అబ్బ నశ్యం కంపుః" అని చీదరించుకుంటూ, దాన్ని మునివ్రేళ్ళతో మళ్ళీ అలమర్లోకి జాగ్రత్తగా జారవిడిచి వంటింట్లోకి వెళ్ళింది.

మరో అరగంటకు కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా ఆఫీసునుండి వచ్చిన ప్రకాశం బట్టలు మార్చుకుని, కాఫీ త్రాగి, కాసేపు సేదతీరి, కళ్లజోడు పెట్టడానికి అలమరు దగ్గరకెళ్ళి చూసేవరకు తండ్రి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిన విషయం తెలియదు. పెళ్లాం చెప్పలేదు. పెద్దకూతురు చెప్పలేదు, చిన్నకూతురు చెప్పలేదు.

ఉత్తరాన్ని ఆత్రంగా చింపుతూ, "ఉత్తరం చింపి చదవకపోయినా కనీసం ఉత్తరం వచ్చినట్లయినా చెప్పలేదేం లక్ష్మీ!" అన్నాడు.

"ఎటూ చూస్తారుగా, మళ్ళీ ప్రత్యేకించి చెప్పాలా ఏం? కాకపోయినా ఆ ఉత్తరాల్లో ఏం రాజకీయాలూ, రాచకార్యాలుంటాయనీ అంత ఇదయిపోతారూ?" అంది సాగదీస్తూ.

ఉత్తరం చదువుతున్న ప్రకాశం, తల్లి ఆరుపేటల చంద్రహారంలోంచి తలా రెండు పేటలిచ్చే ప్రస్తావన రాగానే ఆనందంతో గావుకేక పెట్టాడు.

తల దువ్వుకోబోతున్నదల్లా అతని కేకవిని వేంకటలక్ష్మి హడావుడిగా వచ్చింది. వుత్తరంలోని సమాచారం వినగానే ఆమె మొగం వికసించింది.

"ఏఁవిటీ, నిజమే! ఏదీ వుత్తరం - నన్ను చదవనీయండి - పొద్దుననగా వచ్చిన వుత్తరం చదవకనే పోయితిని - అబ్బ, ఇలా ఇవ్వండీ! ఏం రాసుందో చూడనీయండి!" అంటూ మొగుడి చేతిలో వున్న వుత్తరాన్ని వూడబెరుక్కుంది.

జుట్టయినా ముడవకుండా ఎంతో ఆత్రంగా కళ్ళింత చేసుకుని చదవసాగింది.

ఇంతలో పెద్దకూతురు వనజ వచ్చింది. "ఏదమ్మా నన్ను చూడనీయమ్మా, ఏం రాసి వుందో-" అంటూ తల్లి చేతిలో వుత్తరం లాక్కుంది.

ఆమె చదివేలోపలే చిన్న కూతురు జలజ వచ్చి, "అబ్బ నన్ను చదవనియ్యవే" అంటూ ఆమె చేతిలోంచి ఆ ఉత్తరాన్ని గుంజుకుంది. ఇప్పుడామెకు ఆ ఉత్తరం ముసలి కంపూ, నశ్యం కంపు వెయ్యటం లేదు. సెంటు వాసనలు వెదజల్లే పెళ్ళి పత్రికలాగా వుంది.

ఇల్లంతా ఆ సమయంలో చాలా సందడిగా వుంది. ఎంతో సంతోషంగా వుంది. ఏ చీకూ, చింత లేకుండా హాయిగా నవ్విన నవ్వులాగా వుంది.

"ఈ బంగారంతో ముత్యాల గొలుసు చుట్టించుకుంటానండీ! ముత్యాల గొలుసు చేయించుకోవాలని ఎన్నాళ్ళు నుంచో వుందండి!" ముద్దుగా, గారాంగా అంది భార్య.

"అమ్మామ్మా, నేను జూకాలు చేయించుకుంటానే! మొన్ననే మా ఫ్రెండ్ నళిని కొత్తమేడ జూకాలు చేయించుకుంది. అబ్బ - ఎంత బాగున్నాయనీ!" వుషారుగా చిన్న పిల్లలాగా గంతులేస్తూ పెద్ద కూతురు అంది.

"అమ్మా, మెళ్ళోకి నేను పక్కింటి పంకజం గారి లాటి ఛేన్ చేయించుకుంటానే!" ముద్దులు గుడుస్తూ చిన్న కూతురు అంది.

"స్టాప్-స్టాప్ - మన భాగానికొచ్చే ఆ రెండు పేటల్లో ఇవన్నీ రావు" అని అన్నాడు ప్రకాశం.

ఈ మాటకు అతని భార్య ఏదో గుర్తు వచ్చినదానిలా నొసలు ముడిచి మొగం చిట్లించింది కోపంతో ముక్కు లెగరేసింది.

"ఉన్న పొలం పుట్రా అమ్మి ఆరు వేల కట్నం పోసి పెళ్ళి చేసి, యింట్లో సామానంతా దోచి పెట్టింది చాలక మళ్లీ ఈ గొలుసులో కూడా భాగం పెట్టాలా?" అని గింజుకుంది.

"ఎవరికే?"

"ఇంకెవరికి, చెల్లెమ్మకు. వుందిగా, మంగతాయారమ్మ."

"పోన్లేవే, యింటి ఆడబడుచు-" ప్రకాశం.

"యింటి ఆడబడుచు, యింటి ఆడబడుచు అంటూ యిల్లంతా గుల్ల చేసి పెట్టిందీ మీ అమ్మ చూస్తాగా, గొలుసులో ఎలా భాగం పెట్టుతుందో?"

"అమ్మా, నా జూకాలే!"

"అమ్మా, నా ఛెయినే!"

* * *

కాకినాడలో వుంటున్న శేఖరం ఆఫీసులో వుండగా వుత్తరం అందింది. తల్లి చంద్రహారంలో రెండు పేటలిస్తానన్న విషయం చదవగానే అతనికెంతో ఆనందమయింది. గొలుసులో తోడబుట్టిన చెల్లెలకు కూడా భాగం పెట్టుతానన్న విషయం మాత్రం ముల్లులాగా మాటిమాటికి మనసులో కలుక్కుమనసాగింది.

ఈ విషయంలో మనిద్దరం కలిసి తీవ్రమైన అభ్యంతరం చెప్పాలనీ, ఆ గొలుసు మనిద్దరికే చెందాలని (అప్పటికప్పుడు కవరు తెప్పించి) ఆ ఫళాన వెంటనే అన్నగారికి వుత్తరం రాసి పడేశాడు.

అతని భార్య యశోద వయస్సులో అతనికంటే చిన్నగా, అందంలో మిన్నగా వుంటుంది. పయిగా షోకుగా వుంటుంది. పెళ్ళానికి రకరకాల నగలు చేయించటం, మంచి మంచి చీరలు కొనటం, కొత్త కొత్త ఫాషన్లు మప్పటమంటే శేఖరంకు సరదా. పెళ్ళాన్ని ఎప్పుడూ జుట్టు చెరగనీయకుండా, బట్ట మాయనీయకుండా, అందం చెడకుండా, నలగని పువ్వులాగా, ఆకర్షణీయంగా చూచుకోవటమే ఇతగాడి జీవితలక్ష్యమా అన్నట్లుగా వుంటాడు.

ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకు, ఆ బంగారంతో ఏ మోడల్‌లో, ఎలాటి నగ చేయించాలో అతనూ, అతని భార్యా కలిసి చర్చించారు. చివరకు అతని ఆఫీసులో సునందనే లేడీ క్లర్క్ కొత్తగా చేయించుకున్న నల్లపూసల గొలుసు లాటిది చేయించాలనే నిర్ణయానికొచ్చారు.

మంగతాయారుకూ, ఆమె భర్త శేషగిరికీ, ఆమె అత్తగారికీ, ఆడబిడ్డలకూ తల్లి గొలుసులో కొడుకులకు భాగం పెట్టటం బొత్తిగా నచ్చలేదు.

"లోకంలో ఎక్కడయినా తల్లి నగలు కూతుళ్ళకిస్తారు గాని, కొడుకుల కివ్వటం మేం ఎక్కడా చూడలేదమ్మా!" అని మూడోసారి కనటానికి పుట్టింటికొచ్చిన పెద్దాడబిడ్డ సాగదీసుకుంది.

"వుత్త దేభ్యం - గట్టిగా మాట్లాడలేదు" అని భర్త అన్నాడు.

"చిన్న పిల్ల పుట్టి నాలుగేళ్ళయింది. దాని మొగానికి మురుగులన్నా చేయించిన పాపాన పోలేదు. అమ్మమ్మగారంట - అమ్మమ్మ గారు!" అని అత్తగారు చురక తగిలించింది.

ఆ రాత్రి, "అమ్మ యిచ్చే రెండు పేటలతో చిన్నదానికి రింగులూ, చేతికి గాజులు చేయిద్దామండీ!" అని అంది భర్తతో.

"మొన్న నీ అబార్షన్ కు చేసిన అప్పుకు వడ్డీ తెగ పెరిగి పోతోంది. ముందు దాన్ని తీర్చాలి మంగా-" అని అన్నాడు శేషగిరి.

"మీరెలా తీర్చుకుంటారో తీర్చుకోండి. చిన్నదానికి మాత్రం రింగులూ, గాజులూ చేయించాల్సిందే-" అని గట్టిగా అంది.

## 2

పది రోజుల తర్వాత సూర్యప్రకాశానికి మళ్ళీ తండ్రి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

శాంతమ్మ (ప్రకాశం వాళ్ళ తల్లి) నాల్గురోజుల క్రితం బాత్‌రూంలో కొత్తగా సిమెంట్ చేయించిన గచ్చుమీద కాలుజారి పడిందనీ, కాలు బాగా వాచిపోయిందని, వుడికించిన చింతపండు కట్లు కట్టినా, బెల్లం పట్లు వేసినా తగ్గలేదని, బాధ రానురాను ఎక్కువయిందని, కాలు అసలు క్రింద పెట్టనీయటం లేదని వ్రాశాడు. వాళ్ళ ఇంటి డాక్టరు శాస్త్రిగారు చూసి, కాలి ఎముక ఏదయినా విరిగి వుంటుందని, ఎక్సరే తీయించవల్సి వుంటుందని, అమెరికన్ ఆసుపత్రిలో చూపించమని చెప్పినట్లుగా కూడా వ్రాశాడు.

ఆయన ఇంకా ఇలా వ్రాశాడు :

"మనూరి అమెరికన్ ఆసుపత్రిలో వైద్యమంటే మాటలా? ఆ పరీక్షని, ఈ పరీక్షని, ఎక్సరే అని

చాలా ఫీజులవుతాయి. ఈ ఫీజులు మనం భరించలేం. బోలెడు డబ్బు కావాలి. నా చేతిలో పైకం లేదు. అలా అని వుపేక్ష చేయటానికి మనస్కరించలేదు. మీ అమ్మ రాత్రింబవళ్ళూ పడే బాధ చూడలేకుండా వున్నాను. అందుకని మీ అమ్మ చంద్రహారంలో రెండు పేటలు ఈరోజే వెంకటాచారికి అమ్మి, ఆసుపత్రికి తీసికెళ్ళుదామనుకుంటున్నాను. పోతే పోయినాయి రెండు పేటలు, ఆమె ప్రాణం కంటె ఎక్కువా?''

అంతవరకు ప్రసన్న చిత్తంతో వుత్తరాన్ని చదివిన వేంకటలక్ష్మి చివరి ఈ రెండు వాక్యాలు చదవగానే కోపంతో కుత కుత వుడికిపోయింది. ఆమె మొగం ధుమధుమ లాడింది. ఆమె గుండెలు భుగభుగలాడాయి. ఆమెకు మిగతా వ్రాత కనిపించలేదు. మిగతాది ఏమి వ్రాసినా ఆమె కనవసరం కూడా. ఆమె కవసరమయిందల్లా చంద్రహారంలోని పేటలే!

"ఈ ముసలి ముండ చచ్చింది కాదు; బ్రతికిందీ కాదు'' అని అంటూ ఆ ఉత్తరాన్ని కోపంతో వుక్కురోషంతో, నిరాశా నిస్పృహలతో ప్రక్కకు విసిరేసింది.

"ఏఁవిటయిందమ్మా?'' అంటూ క్రింద పడ్డ వుత్తరాన్ని తీసుకొని చదివిన పెద్ద కూతురు వనజా, "ఏంటే, లెట్ మి సీ-'' అని అక్క చేతిలోంచి ఉత్తరాన్ని గుంజుకుని చదివిన చిన్న కూతురు జలజా కూడా వుత్తరంలో పైన రాసిన రెండు వాక్యాల దగ్గరకొచ్చేసరికి ఆగిపోయారు. కోపంతో వణికిపోయారు. చాలా విసుగుతో వుత్తరాన్ని అవతల పారేశారు. (వీళ్లే కాదు, కాకినాడలో శేఖరం, అతని షోకిల్లా భార్య యశోదా, గుంటూరులో మంగతాయారు, ఆమె భర్త శేషగిరి, ఆమె అత్తగారూ, ఆడబిడ్డలూ, సుందరరామయ్య దగ్గర్నుంచి వచ్చిన వుత్తరాన్ని చదువుతూ మధ్యలో ఆపివేయటం, షాక్ తినటం, కోపంతో వూగిపోవటం, నీరసంతో ఒకచోట కూలబడడం, సణుక్కోవటం, గొణుక్కోవటం, మెటికలు విరవటం, శాపనార్థాలు పెట్టటం - సరిగ్గా ఇక్కడే - ఈ రెండు వాక్యాల దగ్గరే!'

వుత్తరాన్ని సొంతం చదివింది పాపం ప్రకాశమే! సాయంత్రం అతడు ఆఫీసు నుంచి వచ్చీ రాగానే, ఇంకా గుమ్మంలో వుండగానే "అమ్మ జారిపడిందట, అయ్యో గొలుసమ్మి ఎక్సరేలు తీయిస్తున్నాడంట. ఇదిగో-'' అని సాగదీసుకుంటూ వేంకటలక్ష్మి వుత్తరాన్ని అందించింది.

ఆ రెండు వాక్యాల దగ్గర ఒక లిప్తపాటు ఆలోచిస్తూ ఆగిపోయినా మిగతాది కూడా చదివేడు. మిగతాది ఎలా వుంది :

"... డబ్బు పంపమని నీకు గానీ చిరంజీవి శేఖరంకు గానీ వ్రాయటానికి నాకు మనస్కరించటం లేదు. ఎందుకంటె నీకు ఎదిగిన ఆడపిల్లలున్నారు. వాళ్ళ చదువుకు, సంధ్యలకూ, రేపు పెళ్ళిళ్ళకు పేరంటాలకూ ఖర్చు చాలా వుంటుంది. పోనీ చిరంజీవి శేఖరంకు వ్రాద్దామంటే వాడు తనకు పూరి నిండా అప్పులయ్యాయని, మన యింటి మీద వచ్చే అద్దె తాలూకు డబ్బు ఏమయినా సర్దుబాటు చెయ్యమని వాడీమధ్య వుత్తరాలు వ్రాస్తున్నాడు. వాడికి పిల్లా జెల్లా లేరు, పయిగా నీకన్నా జీతం కూడా ఎక్కువే, మరి వాడికెందుకు అన్ని అప్పులయ్యాయో అర్థం కాకుండా వుంది. మీ అమ్మకు వాడ్ని గురించిన మనాది ఎక్కువగా వుంది. ఈ పరిస్థితుల్లో మీ అమ్మ చంద్రహారంలో రెండు పేటలమ్మటం కన్నా నాకేమీ మార్గం

కనిపించటం లేదు..."

వుత్తరం చదవటం పూర్తిచేసి ప్రకాశం దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఈవిడగారు వున్నచోట వుండకుండా ఆ బాత్‌రూంలోకి ఎందుకు పోవాలి? ఎందుకు జారి పడాలి?"

"వెళ్ళిందనుకో, మరీ అంత ఇదా? కిందా, మీదా చూచుకోవద్దు."

"కాకపోయినా ఈ ముస్సలాయన వుండి వుండీ ఇప్పుడే సిమెంటు చేయించాలా?"

"మరీ చోద్యం కాకపోతే వూరికే కాలు వాచిన దానికే వంటిమీద బంగారం తెగనమ్ముకుని మరీ ఎక్సరేలు సింగినాదాలూ తీయించాలి కాబోలు!"

"మూడు పిండికట్టు కట్టితే పోఁయే!"

"ఉహూఁ - ఆమె తలా రెండు పేట లిస్తుందంటే నీవు నమ్మావా?"

"మహాతల్లి! ఆ రెండు పేటలతో పోనిస్తుందో మిగతా వాటిని కూడా మింగుతుందో".

- బందర్లో అన్నా, కాకినాడలో అన్నా, గుంటూరులో అన్నా దాదాపు ఈ మాటల్లే త్రిప్పి త్రిప్పి రకరకాలుగా అనుకున్నారు. మంగతాయారు అత్తగారయితే కోడలు వినకుండా, "జారి పడింది పడినట్లు గుటుక్కుమన్నా పీడాపోయేది!" అని అంది కూడా.

మంగతాయారు, "నీ పాపిష్టి మొగానికి గాజులు, రింగులు కూడాను!" అని చిన్న కూతురు వీపుమీద దభీదభీమని గుద్దింది, కోపాన్ని అణుచిపెట్టుకోలేక.

ఆ రాత్రి యశోద పక్కలో మొగుడ్ని చేతులతో నెట్టేసింది. "నన్ను ముందుగా అడిగీ పెట్టకుండా అమ్ముకుంటే నన్నే చెయ్యమంటావే? నీ నల్లపూసల గొలుసు ఎక్కడికీ పోదులే - ఎరియర్స్ వస్తాయిగా వాటితో చేయించుకుందువుగానే!" అని బ్రతిమాలాడు.

"ఎరియర్స్‌తో రాళ్ల గాజులు చేయిస్తామన్నారుగా" అని తెగ గింజుకుంది అతని అందాల భార్య.

"నా మొగానికి తోడు ముత్యాల గొలుసు కూడా" అని రుసరుసలాడింది వేంకట లక్ష్మి.

"ఎంచక్కా జూకాలు పెట్టుకుందామనుకున్నాను" అని వనజ నీరసంగా అంది.

"నీవు ఏఁవనుకున్నావే చిన్నమ్మడూ! ఛెయినా?" అని ప్రకాశం భార్యను, కూతుళ్లను నవ్వులు పట్టించాడు.

వీళ్లందరిలోకీ నవ్వగలిగింది ప్రకాశం ఒక్కడే!

అందరూ రెండు పేటలకోసం బాధపడ్డారు కానీ, ఆ ముసలమ్మ కోసం ఎవరూ బాధపడలేదు. అయ్యో పాపం, కాలినొప్పితో ఈ వయస్సులో ఎంత బాధపడుతుందోనని ఏ ఒక్కరూ అనుకోలేదు.

## 3

మళ్ళీ వారం రోజులు గడిచేదాకా సుందర రామయ్య దగ్గర్నుంచి ఎలాటి సమాచారమూ లేదు. ఒకరోజు శాంతమ్మకు సీరియస్‌గా వుందని మూడూళ్ళకూ టెలిగ్రాంలు వెళ్ళాయి.

ఒక గంట అటూ ఇటూగా అంతా వచ్చారు. ప్రకాశం కూతుళ్ళిద్దర్నీ యింటి దగ్గరే వుంచి భార్యతో కలిసి వచ్చాడు. కాకినాడ నుండి శేఖరం భార్యతో వచ్చాడు. గుంటూర్నుంచి తాయారు ఒక్కతే వచ్చింది. మళ్ళీ ఇదొక ఖర్చని బయలుదేరబోయే ముందు కోడళ్ళు విసుక్కున్నారు. తాయారు అత్తావాళ్ళు సూటిపోటీగా మాటలన్నారు. కొడుకులిద్దరు వాళ్ళ వాళ్ళ మనస్సుల్లో ఏమనుకున్నారో తెలియదు.

కన్నబిడ్డలను చూడకానే శాంతమ్మ లోతుకు పోయిన కళ్ళల్లోకి వెలుగు తొంగి చూసింది. నీరసించిపోయిన శరీరంలోకి ఎక్కడ్నుంచి వచ్చిందో రవ్వంత సత్తువ వచ్చింది. కొడుకులిద్దర్నీ, కూతుర్నీ మంచం మీద కూర్చోమని సైగ చేసింది. ఎండిపోయి కట్టెపుల్లల్లాగా వున్న చేతితో బిడ్డలు ముగ్గుర్ని ప్రేమగా వళ్ళంతా తడిమి తడిమి చూచుకుంది. ఏదో మాట్లాడాలనుకుంది; ఆయాసం వల్ల మాట పెకిలి రాలేదు.

"బిడ్డలో బిడ్డలో అని ఈ వారం పది రోజుల్నుంచి ఎంతగా కలవరించిపోయిందో!" ప్రక్కింటి భాగ్యమ్మ కళ్ళొత్తుకుంది.

"ఇప్పటిదాకా మన సోయలో లేకుండా పడివున్న మనిషికి బిడ్డల్ను చూడగానే చూశావా పిన్నీ, ఎంత వోపిక వచ్చిందో!" అంది ఎదురింటి పేరమ్మ.

"ప్రేమలంటే అట్లా వుంటాయమ్మా, వేంకట లక్ష్మి," అంది భాగ్యమ్మ.

వేంకటలక్ష్మి మొగం ముడ్చుకుంది.

శాంతమ్మ భర్త వంక చూచి మెల్లగా ఏదో గొణిగింది. ఏమంటున్నదో ఎవరికి అర్థం కాలేదు.

"ఏంటే శాంతా!" అని సుందరరామయ్య దగ్గర కొచ్చి అడిగాడు.

మెడ తడుముకుని భర్తకేదో సైగచేసింది. అప్పుడాయన అర్థమైనట్లు లోపలకెళ్ళి చంద్రహారం తీసికొచ్చి భార్య చేతికిచ్చాడు. అందరి చూపులూ ఆ గొలుసు మీదే వున్నాయి. కళ్ళతోనే దానిలోని పేటలు లెక్కపెట్టారు. ఆరుపేటల చంద్రహారంలో చెక్కు చెదరకుండా అన్ని పేటలూ వుండడం చూచేసరికి అందరి కళ్లూ ఆశ్చర్యంతో ఇంతింతయ్యాయి. దాచుకుందామన్నా దాగకుండా సన్నని ఆనందరేఖలు అందరి మొగాల్లోనూ ప్రాకులాడాయి. కోడళ్ళిద్దరి మొగాలూ చేటంతయ్యాయి. అంతదాకా గదిలో చెరొక ప్రక్కా గోడకు జారిగిలా పడి కూర్చున్నవాళ్ళు చంద్రహారాన్ని చూడగానే మంచం చుట్టూ మూగారు.

"రెండు పేటలమ్మబోతున్నానని మీ ముగ్గురికీ వుత్తరాలు వ్రాశానా! తీరా, వేంకటాచారి దగ్గరకు తీసికెళ్లబోతుంటే అమ్మటానికి వీలులేదని గొడవ చేసింది. శుక్రవారప్పూట లక్ష్మీదేవిని ఇంట్లోంచి కదిలిస్తావా, పిల్లలకిస్తానన్న గొలుసు నా వైద్యం కోసం అమ్ముతావా, నాకు మందూ మాకూ లేకపోయినా సరే గొలుసు మాత్రం ముట్టుకోటానికి వీలులేదని గొడవ గొడవ చేసింది-" అని అన్నాడు తండ్రి.

"మరి అమెరికన్ ఆసుపత్రిలో చూపించనేలేదా?" అని ప్రకాశం అడిగేడు.

"అమెరికన్ ఆసుపత్రికి తీసికెళ్ళితే అసలింతవరకు వచ్చేదే కాదు. చేతులారా చేసుకుంది. నీ

ప్రాణం కంటె వెధవ సొమ్ములు ముఖ్యమా అని మేమెంత చెప్పినా విన్లేదు నాయనా! 'పిల్లలకిచ్చే గొలుసు, పిల్లలకిచ్చే గొలుసని కవ్వర్లాడి పోయింది'' అని ప్రకాశం వాళ్ళ మేనత్త కాంతమ్మ అంది.

మందూ మాకూ లేకుండా ఏమయిపోతావని భర్త గట్టిగా అనేసరికి దొడ్లో కాసిన కొబ్బరికాయ లమ్మిన డబ్బులూ, అప్పుడప్పుడూ తను కూడబెట్టిన డబ్బులూ వేరే వున్నాయని అప్పుడు బయటపెట్టింది. అవీ తాయారు చిన్నకూతురుకు మురుగులు చేయించాలని కూడబెట్టింది. ఆ కొద్ది మొత్తం అమెరికన్ ఆసుపత్రిలో చూపించటానికి సరిపోదని వేరే డాక్టరు దగ్గరకు తీసికెళ్ళాడు.

"డాక్టరు రమేష్ అని, బెజవాడ నుంచి వచ్చి ఇక్కడ ప్రాక్టీసు పెట్టాడు. మన శాస్త్రి గారి సలహా మీదే ఆయనకు చూపించాను. ఆయనా బాగానే వైద్యం చేశాడు. కాని, ఎవరేం చేస్తారు. అంతకు ముందున్న గుండెదడ, ఆయాసమూ ఆ పడటంతో ముంచుకొచ్చాయి.'' అన్నాడు సుందరరామయ్య విరక్తిగా.

"ఏం ముంచుకొచ్చినా, నీవు నూరు చెప్పు వెయ్యి చెప్పు బావా, అమెరికన్ ఆసుపత్రిలో చూపించినట్లయితే ఇలా అయ్యేది కాదు'' అని అన్నాడు మేనత్త మొగుడు.

పిల్లలను కళ్ళారా చూసేక, చంద్రహారం గొలుసు వాళ్ళ చేతుల్లో పెట్టాక శాంతమ్మ పరిస్థితి కాస్త మెరుగ్గా వుంది. రసం యిస్తే త్రాగింది. మధ్యాహ్నం పూట కాసేపు సుఖంగా నిద్రపోయింది. ఆ సాయంత్రానికి కాస్త మాట్లాడగలిగింది. నీరసంగా ఎక్కడో నూతిలోంచి మాట్లాడినట్లుగా అందరినీ పేరుపేరునా పిల్చి ఆమాటా ఈమాటా మాట్లాడింది.

ఆ తెల్లారకట్ట శాంతమ్మకు ఆయాసం ముంచుకొచ్చింది. ఒక గంటసేపు విపరీతమైన బాధ అనుభవించి శాశ్వతంగా కన్నుమూసింది.

కర్మకాండల కయ్యే ఖర్చు కొడుకులిద్దరు వంతు లేసుకుని చేశారు. వంతు లేసుకోవటంలో ఇద్దరూ తగాదాలు పడ్డారు. వీళ్ల తగాదాలు చూసి, "ఈ గొడవంతా ఎందుకు? ఎటూ ఆమె చంద్రహారం వుండనే వుంది. అది అమ్మేసి ఇవన్నీ జరిపించండి. మిగిలింది పంచుకోండి.'' అని బంధువుల్లో ఒకాయన సలహా యిచ్చాడు. గొలుసమ్మటానికి అన్నదమ్ములిద్దరూ వొప్పుకోలేదు.

తీరా చంద్రహారంలో పేటలు పంచుకోవచ్చేసరికి మళ్ళీ తగాదా, మంగతాయారుకు భాగమివ్వటానికి పేచీ పెట్టారు. చెల్లెలు భాగం ఎగగొట్టే విషయంలో మళ్ళీ అన్నదమ్ములిద్దరూ ఒక్కటయ్యారు. తోడి కోడళ్ళు ఒక్క మాటమీద నిలిచేరు. తాయారు ఏడ్చి రాద్ధాంతం చేసింది. చివరకు బంధువులు కల్పించుకుని, "సొమ్ము మీ ముగ్గురి మొగాన కొట్టాలని ఆ తల్లి తెగ ఆరాటపడి ఆఖరికి సరైన వైద్యం లేక ప్రాణం మీదకు తెచ్చుకుని కన్ను మూసింది. దాన్ని పంచుకోవటానికి మీరిలా పేచీలు పడుతున్నారు. ఇదేం బాగోలేదని'' కూకలేశారు. చివరికి ఎలాగైతేనేం చెల్లెలకు కూడా భాగం పెట్టారు.

తలా రెండు పేటలు పంచుకుని తెంచుకుని ఎవరిదార్ని వారు పోయారు. పెళ్ళాల మీద, పిల్లల మీద, నగల మీద, డబ్బు మీద తమకున్న ప్రేమలోంచి రవ్వంతయినా చనిపోయిన తల్లికి గాని, బ్రతికి వున్న తండ్రికి గాని పంచి యివ్వలేకపోయారు. అయ్యో, మా అమ్మ ఎంత మంచిదని ఎవరూ మనస్ఫూర్తిగా అనుకోలేదు.

ఎవరిదార్ని వాళ్ళు పోయాక తండ్రి ఒక్కడే ఒంటరిగా మిగిలిపోయాడు. మాతో వచ్చి కొన్ని రోజులుండమని ఏ ఒక్కరూ అన్లేదు.

* * *

శేఖరం భార్యతో కాకినాడ చేరుకునేసరికి సాయంత్రం ఆరుగంటలయింది. మొగుడూ, పెళ్ళాలు హాయిగా చన్నీళ్ళ స్నానాలు చేసి, వేడివేడిగా అన్నాలుతిని పడకటింట్లోకి జేరేసరికి తొమ్మిది గంటలయింది. యశోద ఇస్త్రీ చేసిన తెల్ల వాయిలు చీర కట్టుకుని (స్టేషన్నుంచి యింటికి వస్తూ సెంటర్లో రిక్షా ఆపి, కొన్న) మల్లెపూలు జడనిండా పెట్టుకుని, సెంటు పూసుకుని దేవకన్య లాగా తయారయి వచ్చింది.

చేతులు వెనక్కి పెట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ, "మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచేయమంటారా?" అని అడిగింది.

"ఏంటో, అంత ఆశ్చర్యంలో మునిగిపోయే విషయం?" అంటూ నడుంచుట్టూ చేతులేసి ముందుకు లాక్కున్నాడు.

చేతులు ముందుకు పెట్టి గుప్పిళ్ళు తెర్చింది. ఆమె కుడి అరచేతిలో బాగా అరిగిపోయి నొక్కులు పడ్డ రెండు పాత బంగారు గాజులున్నాయి. వాట్ని చూసి శేఖరం నిజంగానే ఆశ్చర్యపోయాడు.

"ఇవి ఎక్కడివి?" అని అడిగేడు.

"మీ అమ్మగారివి" అని అంది.

"మా అమ్మవా, నీకెవరిచ్చారు?"

"మీ అమ్మగారే!" విజయగర్వంతో నవ్వుతూ అంది.

చనిపోయే రోజు సాయంత్రం శాంతమ్మ కాసేపు అందరితో ఆమాటా ఈ మాటా మాట్లాడిందని చెప్పాం కదా - అప్పుడామె చిన్న కోడల్ని పిల్చి పక్కలో కూర్చోపెట్టుకుని మెల్లగా, అబ్బాయికి (శేఖరంకు) అప్పులెందుకయ్యాయని అడిగింది. ఆ సమయంలో మంచందగ్గర ఎవరూ లేరు. శేఖరం అప్పుడు ఎందుకోసమో బజారుకెళ్ళాడు. యశోదకు మొగం వెలాతెలా పోయింది. అత్తగారు అడిగినదానికి ఏమని చెప్పాలో తోచలేదు.

ఆఖరికి మెల్లగా, "ఆయన ఈమధ్య తాగుతున్నారు; పేకాట ఆడుతున్నారు. డబ్బంతా పాడుచేస్తున్నారు." అని బొంకింది.

ఆ మాట వినేసరికి శాంతమ్మ దిమ్మెర పోయింది. ఎంతో బాధపడిపోయింది. తన కడుపున పుట్టిన బిడ్డ ఇలా అయిపోయాడేమిటా అని ఆ తల్లి ప్రాణం విలవిల్లాడిపోయింది. కనుకొలుకుల్లోకి కన్నీరు వుబికింది.

అప్పుడామె దిండు క్రింద నుండి మెల్లగా ఈ రెండు గాజులు తీసి కోడలి చేతిలో పెట్టి "అబ్బాయికిచ్చి వీటితో అప్పులు తీర్చుకోమని చెప్పు!" అని అంది.

యశోద, తను ఆడిన అబద్ధానికి అత్తగారి దగ్గర్నుంచి రెండు బంగారు గాజులొచ్చాయని ఆనందంతో వుక్కిరి బిక్కిరయిపోయిందే గాని, ఈ మాట విన్నప్పుడు ఆ ముసలి తల్లి మనస్సు ఎంత గిజగిజలాడిపోయిందో, ఆమె వదనం ఎంత విషాదభరితమైందో గ్రహించలేకపోయింది.

"మళ్ళీ ఎవరికైనా తెలుస్తే వీటిల్లో కూడా భాగం పెట్టమంటారని గమ్మున ఎవరూ చూడకుండా నా పెట్టెలో చీరల అడుగున దాచేశాను. అందుకే మీకు కూడా చెప్పలేదు. ఈ విషయం ఎవరు వింటారో ఎక్కడ బయటకు పొక్కుతుందోనని హడలిపోయి చచ్చాను-" అని అంది ఏదో పెద్ద ఘనకార్యం చేసినట్లు.

అంతా విని, "మొత్తానికి నాకు త్రాగుడూ, పేకాట అలవాటు అంటగట్టేవన్నమాట. బలే తెలివికలదానివే!" అని భార్యను మెచ్చుకున్నాడు.

"మీరు లేని అప్పులున్నవన్నట్లు ప్రచారం చేసుకోలా?" అని అంది.

"ఏవండి. ఈ గాజులు చెడగొట్టించి నేను చెవులకు రింగులు చేయించుకుంటానండి!" అని గారాలు పోయింది.

శేఖరం "ఓకె డార్లింగ్" అంటూ లైటార్పేశాడు.

* * *

ఒక రాత్రివేళ శేఖర్‌కు మెలకువ వచ్చింది.

లేచి లైటేసి మంచినీళ్ళ త్రాగుతూ టేబులు మీద వున్న ఆ గాజులను చూశాడు. "యశోద గాజుల్ను ఇక్కడే పెట్టేసింది" అని అనుకుంటూ అలమరలో పెడదామని వాట్ని చేతిలోకి తీసుకున్నాడు.

ఆ పాత బంగారు గాజులను తాకగానే ఎందుకనే అతని వళ్ళు ఝల్లుమంది. కన్న తల్లి రెండు చేతులూ తన చేతుల్లో వున్నట్లనిపించింది. తల్లి చేతి గాజులు చేతులయి, ఆ చేతులు తనతో మాట్లాడుతున్నట్లనిపించింది. - "నాయనా, ఒరే శేఖరం, నీ చెడు అలవాట్లను మానుకోరా, బాబు!" అంటూ తల్లి తన రెండు చేతులూ పట్టుకుని ప్రేమగా, దిగులుగా, దీనాతి దీనంగా వేడుకుంటున్న ట్లనిపించింది.

లోకమంతా నిద్రపోతున్న ఆ నిశ్శబ్ద నిశీధి సమయంలో ఇన్నాళ్ళుగా అతనిలో నిద్రపోయిన, అతనిలోని మాతృప్రేమ ఆ క్షణంలో మేల్కొన్నది, అతని గుండెల్ని తడి చేసింది. శేఖరం కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆ గాజులను కళ్ళకద్దుకున్నాడు.

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

*22 ఫిబ్రవరి 1974*

★